

చిన్నబోయిన చెరువు

ఆలమూరు చీలబోయిన చెరువు కింద 300 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువు మీద కొంత మంది కన్నుపడింది. పథకం ప్రకారం ఆక్రమించారు. మొదట చెరువుకు నీరందించే కాలువను, ఆయకట్టు భూములకు నీరు సరఫరా చేసే తూములను పూడ్చేశారు. ఆ తర్వాత ఒట్టిపోయిన చెరువులో పంటలు సాగు చేసుకున్నారు. ఇంత దాకా వచ్చాక ఇక అడ్డం ఏముంది? ఏకంగా పట్టాదారు పాసు పుస్తకాలను పుట్టించుకున్నారు. ఇలా దాదాపు రూ.40 కోట్ల విలువైన భూమి అన్యాక్రాంతమైంది. ఆలమూరు చీలబోయిన చెరువు దాదాపుగా కనుమరుగైంది. ఇంత జరుగుతున్నా మైనర్ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు చీమ కుట్టినట్టు కూడా లేదు. ఆయకట్టు రైతులు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. దీంతో ఈ వ్యవహారమంతా అధికారులకు తెలిసే జరుగుతోందా? అనే అనుమానం వ్యక్తమవుతోంది.

- ఆలమూరు చీలబోయిన చెరువు ఇక లేనట్లే
- చెరువు విస్తీర్ణం 207 ఎకరాలు.. మిగిలింది 42 ఎకరాలు
- దాదాపు 300 ఎకరాల ఆయకట్టుకు అందని సాగు నీరు
- రూ.40 కోట్ల విలువైన భూమి అన్యాక్రాంతం
- నిద్రమత్తులో రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులు



ఆలమూరు చీలబోయిన చెరువు

నంద్యాల (ఆంధ్రజ్యోతి)/ రుద్రవరం ఫిబ్రవరి 26:

ఆళ్ళగడ్డ మండలం మిట్టపల్లె, రుద్రవరం మండలం ఆలమూరు గ్రామాల మధ్యలో అ చెరువు ఉంది. ఇది ఆలమూరు రెవెన్యూ పరిధిలో 99.47 ఎకరాలు, మిట్టపల్లె రెవెన్యూ పరిధిలో 107.98 ఎకరాలు విస్తరించి ఉంది. రెండు గ్రామాల పరిధిలో ఉన్న ఈ చెరువు ఆలమూరు చీలబోయిన చెరువుగానే రికార్డుల్లో నమోదై ఉంది. ఇది చాలా పాత కాలపు చెరువు. నల్లమల కొండల్లో నుంచి వచ్చే వర్షపు నీటితో ఇది నిండేది. ఆ తర్వాత తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి ఉప కాలువ తవ్వి చెరువు నింపేవారు. వర్షాలు రాని సమయంలో కూడా చెరువు నిండే అవకాశం ఉంది. అందువల్ల దాదాపు 300 ఎకరాలు స్థిర ఆయకట్టు ఏర్పడింది. దీని వల్ల భూగర్భ జలాలు నిండుగా ఉండి, చుట్టు పక్కల బోర్లు కళకళలాడేవి. ఈ చెరువు కింద అరటి, తమలపాకు తోటలు, పత్తి, వరి, బొప్పాయి, ఆకుకూరల వంటి పంటలను రైతులు పండించేవారు. అయితే కొంతమంది చెరువు భూమిని కబ్జా చేయాలనుకొని మొదట చెరువుకు నీరు అందించే తెలుగుగంగ ఉప కాలువను పూడ్చేశారు. దీంతో చెరువు నెమ్మదిగా వట్టిపోవడం మొదలైంది. ఆ తర్వాత చెరువు భూములను చదును చేసి సొంతం చేసుకొని సాగు చేయడం మొదలుపెట్టారు. ఇలా ఇప్పటికే చెరువును దాదాపు ముప్పావు వంతు అన్యాక్రాంతమైంది. అక్కడ ఇప్పుడు చెరువు ఆనవాళ్లు కూడా లేవు. చిన్న నీటి కుంట మాత్రమే కనిపిస్తోంది.



కొత్తగా వచ్చా.. విచారిస్తా



రుద్రవరం మండల తహసీల్దారుగా కొత్తగా వచ్చాను. ఆలమూరు చీలబోయిన చెరువు కబ్జాకు గురైందన్న విషయం నా దృష్టికి రాలేదు. గ్రామ వీఆర్వోను అడిగి వివరాలు తెలుసుకొని, నిజమని తెలితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాను.

- మురళీమోహన్, తహసీల్దారు, రుద్రవరం


మూడు గ్రామాలకు చెందిన వారు..

ఆలమూరు చీలబోయిన చెరువు వాస్తవ విస్తీర్ణం 207.95 ఎకరాలు. ఆలమూరు, మిట్టపల్లి గ్రామాల్లో విస్తరించి ఉండటంతో మొదట ఈ గ్రామాలకు చెందిన కొంతమంది చెరువును ఆక్రమించడం మొదలుపెట్టారు. ఆ తర్వాత ఈ గ్రామాల పక్కనే ఉన్న చిత్తరేణిపల్లె గ్రామంలోని మరికొంతమంది కూడా చెరువును చెరపట్టడం మొదలుపెట్టారు. అదేమంటే అది పట్టా భూమి కాదు కదా! ఎవరికి వీలు ఉంటే వారు చదును చేసుకుని పంట సాగు చేసుకోవచ్చు అని సమాధానం ఇస్తున్నారు. ఇలా ఆక్రమించిన వారిలో అన్ని పార్టీల వారు ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరంతా కలిసి చెరువును మింగేయడంతో ప్రస్తుతం చెరువు 42 ఎకరాలు మాత్రమే మిగిలింది. అంటే దాదాపు 160 ఎకరాలకు పైగా భూమి పూర్తిగా కబ్జాకు గురైంది. అందరూ కలిసి చెరువును పూడ్చేయడంతో దీనికింద ఆయకట్టు లేకుండా పోయింది. అంతేకాకుండా చుట్టు పక్కల భూముల్లో భూగర్భ జలాలు పడిపోవడంతో బోర్లు కూడా వట్టిపోతున్నాయి. దీని ప్రభావంతో పంటలకు నీరందించే మార్గం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆయకట్టు రైతులు, చెరువు కింద బోర్లు ఉన్న రైతులు మైనర్ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు చెరువును కబ్జా నుంచి విముక్తి కలిగించి తమ పంటలకు నీరందించే మార్గం చూడాలని మొర పెట్టుకున్నారు. అయితే ఈ విషయం తమ పరిధిలోనికి రాదంటే, తమ పరిధిలోనికి రాదంటూ ఒకరి మీద ఒకరు నెట్టుకుంటూ కాలం గడిపేస్తున్నారు. వీరి నిర్వాకంతో రైతులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోకపోతే ఇక్కడ ఓ చెరువు ఉండేదని భవిష్యత్తులో చెప్పుకోవడానికి కూడా ఆనవాళ్లు మిగలవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అలుగు సమీపంలో కబ్జాకు గురైన చెరువు

నిమ్మకు నీరెత్తినట్లు..

అడవులు, చెరువులు, కొండలు.. ఇలాంటి భూములన్నీ పూర్తి ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయి. వీటి పర్యవేక్షణ బాధ్యత పూర్తిగా అధికారులదే! చెరువులు పూడిపోయినా, వాటి నీటి సరఫరా కాలువలు పాడైపోయినా, కబ్జాలకు గురైనా సంబంధిత అధికారులు వెంటనే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలి. అయితే ఆలమూరు చెరువు గురించి అధికారులు పూర్తిగా పట్టించుకోవడం మానేశారు. చెరువుకు నీటి సరఫరా చేసే ఉప కాలువ పూడిపోయినా, చెరువు వట్టి పోయినా ఏమాత్రం స్పందించలేదు. రెవెన్యూ అధికారులు అలసత్వం వల్ల ఏకంగా ఈ భూములకు పట్టాదారు పాసు పుస్తకాలను కూడా పుట్టించుకున్నారు.



చెరువులో సాగు చేసిన గోంగూర

చెరువంతా కబ్జానే



ఆలమూరు చీలబోయిన చెరువు అంతా కబ్జాకు గురైంది. సాగు నీటి నిల్వలు తగ్గిపోయి ఆయకట్టు భూములకు నీరందడం లేదు. భవిష్యత్తు తరాల వారు ఈ చెరువు గురించి తెలుసుకోవడానికి గట్లు మాత్రం మిగిలాయి.

-శివకుమార్, రైతు, ఆలమూరు

చరిత్ర ఉన్న చెరువు కాలగర్భంలో..



ఆలమూరు చెరువుకు చరిత్ర ఉంది. చెరువు కబ్జా కోరల్లో చిక్కి కాలగర్భంలో కలిసింది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. చెరువంతా కబ్జా అయింది.

-శ్రీనివాసులు, రైతు, ఆలమూరు

అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



చెరువు కబ్జాకు గురైందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. చెరువులో నీరు నిల్వ ఉంటే బోరుబావుల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి. అటు నీరు లేక ఇటు భూగర్భ జలాలు అందక పంటలు నష్టపోతున్నాం.

-రాఘవేంద్ర, రైతు ఆలమూరు

చెరువులో నీరు లేక బోరుబావులు ఎండిపోతున్నాయి



చెరువులో నీరు లేకపోవడంతో బోరుబావులు ఎండిపోయాయి. గతంలో మార్చి చివరి ఏప్రిల్ మాసాల్లో బోరు బావుల్లో భూగర్భజలం పడిపోయింది. ప్రస్తుతం ఫిబ్రవరి మాసంలోనే బోరుబావులు ఎండిపోయాయి.

- సురేష్, రైతు, ఆలమూరు

ఆలమూరు చీలబోయిన చెరువు లోపలి భాగం



అటవీశాఖ దోపిడీకి బ్రేక్

- రుద్రకోడూరుకు వెళ్లే వాహనాల నుంచి వసూళ్లు వద్దు
- శ్రీశైల పాదయాత్రికులకు ఉచితంగానే అనుమతి



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆత్మకూరు, ఫిబ్రవరి 26: శ్రీశైలానికి కాలినడకన తరలివెళ్లే భక్తుల నుంచి పర్యావరణ రుసుం పేరిట అటవీశాఖ చేస్తున్న డబ్బు వసూళ్లపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'అటవీ శాఖ ఆర్థిక దోపిడీ' కథనానికి అధికారులు స్పందించారు. శ్రీశైలానికి వెళ్లే పాదయాత్రికుల నుంచి రూ.10 చొప్పున పర్యావరణ రుసుం పేరిట అటవీశాఖ వసూళ్లు చేసింది. అలాగే నల్లమలలోని రుద్రకోడూరు క్షేత్రానికి వెళ్లే వాహనాలు రూ.300 చెల్లిస్తేనే అనుమతిస్తున్నారు. ఈ వసూళ్లపై హిందూ ధార్మిక సంఘాలతోపాటు శివస్వాములు ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలోని ప్రాంతాల్లో నిరసన వ్యక్తం చేశారు. దీంతో దిగివచ్చిన అటవీ అధికారులు శ్రీశైలానికి కాలినడకన వెళ్లే భక్తులకు ఉచితంగానే అనుమతిస్తున్నారు. ఈ విషయాన్ని నాగలూటి రేంజ్ అధికారి దొరస్వామి స్పష్టం చేశారు. అలాగే మహాశివరాత్రి పర్వదినం వరకు రుద్రకోడూరుకు వెళ్లే వాహనాల నుంచి రూ.300 రుసుము వసూళ్లు చేయబోమని బైర్లూటి రేంజ్ అధికారి సుభాష్ తెలిపారు.

పల్స్‌పోలియోను జయప్రదం చేయండి

జేసీ రాహుల్ కుమార్ రెడ్డి



పల్స్‌పోలియో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేసీ తదితరులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 26: మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో పల్స్‌పోలియో పోస్టర్లను ఆవిష్కరించారు. అదేవిధంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగుతున్న అక్షరాస్యత వారోత్సవాల వాల్ పోస్టర్లను అధికారులు విడుదల చేశారు.

రూ.22 కోట్లతో నంద్యాల రైల్వేస్టేషన్ ఆధునికీకరణ


నంద్యాల టౌన్, ఫిబ్రవరి 26: నంద్యాల రైల్వే స్టేషన్‌ను రూ.22 కోట్లతో ఆధునికీకరించనున్నారు. అమృత్ భారత్ రైల్వేస్టేషన్ల అభివృద్ధి పథకంలో భాగంగా నంద్యాల స్టేషన్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులను కేటాయించింది. సోమవారం ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా దేశ వ్యాప్తంగా 554 రైల్వే స్టేషన్ అభివృద్ధికి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా నంద్యాల రైల్వే స్టేషన్‌లో అత్యాధునిక సౌకర్యాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక అమలు చేయనున్నారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసేందుకు గతి శక్తి పేరుతో ఒక టాస్క్‌ఫోర్సు బృందాన్ని కూడా రైల్వే శాఖ ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ శ్రీహర్ష, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, టెలికాం ఇంజనీర్ పవన్‌కుమార్, ఎలక్ట్రికల్ ఇంజనీర్ చంద్రశేఖర్, వాణిజ్యశాఖ ఇన్‌స్పెక్టర్ షామహమ్మద్, రైల్వే చీఫ్ క్యూకంట్రోలర్ రవిప్రకాష్, రైల్వే డాక్టర్ ప్రియదర్శిని, బీజేపీ నాయకులు డాక్టర్ ఆదినారాయణ, అభిరుచి మధు, మేడా మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

వర్చువల్ ద్వారా ప్రధాని మోదీ శంకుస్థాపన



ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ పోచా, బీజేపీ నాయకులు

మార్చి 7 నుంచి యాగంటి బ్రహ్మోత్సవాలు



బనగానపల్లె, ఫిబ్రవరి 26 : మార్చి నెల 7వ తేదీ నుంచి యాగంటి ఉమా మహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డిలు సోమవారం తెలిపారు. మార్చి 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహించినట్లు వారు వెల్లడించారు. 7న గురువారం యాగంటి ఆలయంలో ఉదయం 5 గంటలకు మహాన్యాసక రుద్రాభిషేకం, కుంకుమార్చన సహస్ర నామావళి, ఉదయం 8 గంటలకు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి 8న శుక్రవారం మహా శివరాత్రి ఉత్సవాలు వేలాది మంది భక్తుల సమక్షంలో నిర్వహించనున్నట్లు వివరించారు. రాత్రి రేలారేలారే కార్యక్రమంతో పాటు జబర్దస్త్ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. అదే రోజు రాత్రి 12 గంటలకు లింగోద్భవ కార్యక్రమం, అనంతరం తెల్లవారు జామున ఉమామహేశ్వరస్వామి కళ్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 9న శనివారం నందికోల ఉత్సవాలు, 10న ఆదివారం స్వామి వార్ల రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 11న సోమవారం శివదీక్ష విరమణ, పూర్ణాహుతి నాగవల్లి, వసంతోత్సవాలు, తెప్పోత్సవం, ధ్వజావరోహణం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఉమామహేశ్వర నిత్యాన్నదాన సంస్థ, ఉమామహేశ్వర రెడ్ల అన్నదాన సంస్థ, ఆర్యవైశ్య అన్నదాన సంస్థ, బసవేశ్వర అన్నదాన సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు భోజన వసతి కల్పించనున్నట్లు వారు తెలిపారు.

మిరప రైతులను కబళించిన మృత్యువు

- కర్ణాటకలో రోడ్డు ప్రమాదం
- పెద్దకడుబూరు మండలానికి చెందిన ముగ్గురి దుర్మరణం
- నాగలాపురం, సింగరాజనహళ్లి గ్రామాల్లో అలుముకున్న విషాదం



యంకన్న (ఫైల్) పి. మస్తాన్(ఫైల్) ఈరన్న (ఫైల్)

పెద్దకడుబూరు, ఫిబ్రవరి 26: మిరప రైతులను మృత్యువు కబళించింది. కర్ణాటకకు వెళ్తున్న మిరప రైతులను రోడ్డు ప్రమాద రూపంలో పొట్టనబెట్టుకుంది. ఈ సంఘటన కర్ణాటకలోని దావణగేరి వద్ద ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థుల వివరాల మేరకు.. పెద్దకడుబూరు మండలంలోని నాగలాపురం, సింగరాజనహళ్లి గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్‌తో సహా పది మంది రైతులు నాలుగు టన్నుల బ్యాడిగి రకం మిరప కాయలను అమ్ముకునేందుకు ఒక మినీ వాహనంలో కర్ణాటకలోని దావణగేరి సమీపంలో ఉన్న బ్యాడిగి పట్టణానికి బయల్దేరారు. ఆదివారం అర్ధరాత్రి వాహనం దావణగేరి సమీపంలోకి చేరుకోగానే టైరు పంక్చర్ కావడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో వాహనంలో ఉన్న బోయ యంకన్న(48), మస్తాన్(48), ఆటో ఈరన్న (35)కు ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. వీరితోపాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. వీరిని సమీపంలోని దావణగేరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదం సమాచారం అందుకున్న రైతుల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హుటాహుటిన సంఘటనా స్థలానికి బయల్దేరారు. బోయ యంకన్నకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మస్తాన్‌కు భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు, ఆటో ఈరన్నకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ముగ్గురు రైతులు మృతి చెందడంతో నాగలాపురం, సింగరాజనహళ్లి లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని తోటి రైతులు, గ్రామస్థులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.


వేదికపై సంఘీభావం తెలుపుతున్న నాయకులు


సభకు హాజరైన తెలుగు తమ్ముళ్లు

టీడీపీతోనే బీసీలకు రాజ్యాధికారం

- అధికారంలోకి రాగానే బీసీలకు రక్షణ చట్టం
- నంద్యాలలో 'జయహో బీసీ' సభ
- తరలి వచ్చిన టీడీపీ శ్రేణులు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 26: తెలుగుదేశంతోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమవుతుందని నంద్యాల జిల్లా టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా టీడీపీ కార్యాలయం వద్ద సోమవారం 'జయహో బీసీ' బహిరంగ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు ఎన్‌ఎండీ ఫరూక్, మాజీ ఎమ్మెల్యేలు బీసీ జనార్ధన్‌రెడ్డి, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, గౌరు చరిత, నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వెదుర్ల రామచంద్రారావు, ఏవీఆర్ ప్రసాద్, తాతిరెడ్డి తులసీరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అబ్దుల్ వహీద్, నంద్యాల జిల్లా యువ విభాగం అధ్యక్షుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గోవిందనాయుడు, జనసేన జిల్లా అధ్యక్షుడు చింతా సురేష్ తదితరులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి టీడీపీ, జనసేన నాయకులు, బీసీ సాధికారత రాష్ట్ర, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు. ముందుగా నాయకులు ఎన్టీఆర్, పూలే కాంస్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ పాలనలో బీసీలను అణగదొక్కారని, బీసీల ద్రోహి జగన్‌మోహన్‌రెడ్డి అంటూ నాయకులు ధ్వజమెత్తారు.

జగన్ పాలనలో దాడులు, హత్యలు, కేసులు



వైసీపీ పాలనలో బీసీలపై దాడులు, హత్యలు, అక్రమ కేసులు నిత్యకృత్యంగా మారాయి. వైసీపీ కులాలను విభజించి పాలిస్తోంది. బీసీ కార్పొరేషన్లు అని చెప్పి పదవులు ఇచ్చి కనీసం కూర్చునేందుకు కుర్చీ కూడా లేకుండా చేసింది. బీసీలకు టీడీపీ ప్రభుత్వం ఎంతగానో గుర్తింపునిచ్చి రాజకీయ రిజర్వేషన్లు కల్పించి స్పీకర్లు, మంత్రులు, ఉప ముఖ్యమంత్రులుగా చేసింది. కార్పొరేషన్ల నుంచి సబ్సిడీ రుణాలు మంజూరు చేసి బీసీ కులాలను, కులవృత్తులకు ప్రోత్సాహకాలను అందించింది. కొలిమిగుండ్లలో బీసీ సోదరుడు వడ్డె సుబ్బారావు రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక వైసీపీ నాయకులు హత్య చేశారు. సుబ్బారావు హంతకులను ఏ ఒక్కరినీ వదిలే ప్రసక్తే లేదు. నా నియోజకవర్గంలో 15 మంది బీసీ సోదరులపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. కష్టపడి పని చేస్తేనే పదవులు వస్తాయి.. పదవులు వచ్చాక ఆ సామాజిక వర్గానికి న్యాయం జరగాలి. అది టీడీపీతోనే సాధ్యం. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఏర్పాటు తథ్యం.

\- బీసీ జనార్దన్‌రెడ్డి, బనగానపల్లె టీడీపీ అభ్యర్థి

వైసీపీని అంతం చేద్దాం



\- బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, శ్రీశైలం అభ్యర్థి

బీసీలు టీడీపీకి వెన్నెముక లాంటి వారు. అట్టడుగున ఉన్న బీసీ వర్గాలను టీడీపీపైకి తీసుకురావడం జరిగింది. ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు పాలనలో బీసీలకు పెద్దపీఠ వేసి వారి అభ్యున్నతికి కృషి చేసింది. జగన్‌మోహన్‌రెడ్డి బీసీ వర్గాలను అణగదొక్కాడు. క్షేత్రస్థాయిలో అందరం కలిసికట్టుగా పని చేసి రాక్షస పాలనను అంతం చేద్దాం. ప్రస్తుతం వైసీపీ జెండాలు మోస్తున్న కార్యకర్తలు కూడా అసంతృప్తిగానే ఉన్నారు. వారిని కూడా కలుపుకొని టీడీపీ విజయానికి కృషి చేయాలి. కష్టపడి టీడీపీ, జనసేన కూటములు అధికారంలోకి తీసుకొద్దాం.


బీసీలను నిలువునా ముంచారు



బీసీలను వైసీపీ నాయకులు నిలువునా ముంచారు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించారు. బీసీలపై హత్యా రాజకీయాలకు తెరలేపారు. బీసీలకు పెద్దపీట వేసింది తెలుగుదేశం పార్టీ మాత్రమే. బీసీలు టీడీపీకి వెన్నెముకలాంటి వారు. బీసీల అభ్యున్నతి కోసం టీడీపీ ప్రభుత్వంలో సబ్సిడీ రుణాల ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపాం. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం వాటన్నింటినీ రద్దు చేసింది. బీసీల ద్రోహిగా జగన్ చరిత్రలో నిలిచిపోయాడు. రాష్ట్ర భవిష్యత్తు, పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని టీడీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. బీసీలపై దాడులను అరికట్టేందుకు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రక్షణ చట్టాన్ని తీసుకొస్తాం.

\- గౌరు చరితారెడ్డి, పాణ్యం నియోజకవర్గ అభ్యర్థి

7 నియోజకవర్గాల్లో గెలిచి బాబుకు గిఫ్ట్ ఇస్తాం



బీసీ సోదరులు ఏకతాటిపై నిలబడి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి. జిల్లాలోని మొత్తం ఏడు నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించి చంద్రబాబు నాయుడుకు గిఫ్ట్‌గా ఇస్తాం. నంద్యాలలో జరిగిన అభివృద్ధి అంతా చంద్రబాబు నాయుడు హాయంలోనే జరిగింది. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీలపై జరిగిన దాడులను అరికట్టేందుకు ప్రత్యేకంగా రక్షణ చట్టాన్ని అమలు చేస్తాం.

\- మల్లెల రాజశేఖర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

పనికి మాలిన పాలన



రాష్ట్రంలోని పనికి మాలిన పాలన ఈ దేశంలో ఎక్కడా లేదు. సీఎం జగన్ ఓ అసమర్థుడు. రాష్ట్రానికి కంపెనీలు లేవు.. ఉద్యోగాలు లేవు. అంతర్జాతీయ విమానాశ్రయం తెచ్చిందీ లేదు. సరైన సదుపాయాలు లేక వచ్చిన కంపెనీలు కూడా పక్క రాష్ట్రానికి వెళ్లిపోయాయి. అన్నివర్గాల ప్రజలు విసిగిపోయారు. ముఖ్యంగా బీసీలపై కక్షతో అరాచకాలు సృష్టించి వారి జీవితాలను నాశనం చేశాడు. బీసీలు అంటేనే టీడీపీ.. టీడీపీ అంటేనే బీసీలు. సిద్ధం అంటూ ఓడిపోయేందుకు జగన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నాడు. తల్లిని, చెల్లిని వదిలేసిన దుర్మార్గుడు జగన్ రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తాడు.

\- ఎన్‌ఎండీ ఫరూక్, నంద్యాల అభ్యర్థి

బీసీలకు న్యాయం జరగలేదు

రాష్ట్రంలో బీసీలకు పదవులు ఇచ్చామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. పదవులు ఇచ్చారుగాని బీసీ వర్గాలకు ఎలాంటి న్యాయం జరగలేదు. రాష్ట్రంలో 70 మంది

టీడీపీతోనే బీసీల్లో ఎదుగుదల



టీడీపీ వచ్చాకే బీసీల్లో ఎదుగుదల వచ్చింది. రాష్ట్రంలో వైసీపీ దుర్మార్గపు విధ్వంస పాలనలో బీసీ సోదరులపై కేసులు పెట్టారు. హత్యా రాజకీయాలను ప్రోత్సహించారు. ఎన్నికలకు ముందు ముద్దులు పెడుతూ వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక జగన్ మోహన్‌రెడ్డి విస్మరించారు. అన్నివర్గాల ప్రజలను మోసం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డికి దోచుకోవడం తప్పా అభివృద్ధి తెలియదు. జిల్లాకు ఎలాంటి పరిశ్రమలు తీసుకురాకుండా యువత జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. జగన్‌ను ప్రజలు తరిమి కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

\- మాండ్ర శివానందరెడ్డి



బీసీ సోదరులను కిరాతకంగా చంపారు. బీసీలకు వరంగా ఉన్న బెస్ట్ అవైలబుల్ పాఠశాల స్కీంను ఎత్తి వేశాడు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే బీసీలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందారు. దుర్మార్గపు జగన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

\- భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి

మన సంస్కృతి, సాంప్రదాయాలు గొప్పవి

పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు


విదేశీయులతో మాట్లాడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, ఫిబ్రవరి 26: భారతదే సంస్కృతి, సాంప్రదాయాలు ఎంతో గొప్పవని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. సోమవారం అమెరికా, కార్లిఫోర్నియా దేశాలకు చెందిన దాదాపు 24 మంది మహిళా భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా విదేశీ భక్తులతో పీఠాధిపతి రాఘవేంద్ర స్వామి మహిమలు, అద్భుతాలు, ఆయన జీవిత చరిత్రను వివరించారు. భారతదేశంలో సంస్కృతి, సాంప్రదాయాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. దేశ చరిత్రను తెలుసుకునే విధంగా రాఘవేంద్ర స్వామి రచించిన గ్రంథాలు, రాఘవేంద్ర స్వామి చరిత్ర తెలియజేసే పుస్తకాలను ఉచితంగా అందజేశారు. అనంతరం ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, ద్వారపాలక అనంతస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూ పీఆర్వోగా రవి శంకర్


నియాక పత్రాన్ని అందిస్తున్న ఆర్‌యూ ఉపకులపతి

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 26: రాయలసీమ యూనివర్సిటీ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా తెలుగుశాఖ ప్రొఫెసర్ డాక్టర్ వి.రవిశంకర్‌ను నియమించినట్లు రిజిస్ట్రార్ డాక్టర్ నాగులు అంకన్న తెలిపారు. సోమవారం ఉపకులపతి ఛాంబర్లో వైస్ చాన్సలర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు.

బర్డ్‌ఫ్లూపై అప్రమత్తం

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 26: నెల్లూరు జిల్లాలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకడంతో జిల్లా అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో కోళ్ల ఫారాల్లోని కోళ్ల నుంచి రక్త నమూనాల సేకరణ ప్రారంభించినట్లు పశుసంవర్ధక శాఖ జేడీ రామచంద్రయ్య సోమవారం తెలిపారు. బర్డ్‌ఫ్లూ వైరస్ ప్రమాదకరమైనదని, కోళ్లు, బాతులు, ఇతర పక్షుల రక్త నమూనాలను సేకరించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటిదాకా 40 రక్త నమూనాలు సేకరించాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 30 శాంపుల్స్ సేకరించామని చెప్పారు. మిడ్తూరు మండలంలోని రోళ్లపాడు బట్టమేక పక్షి కేంద్రంలో వాటి నుంచి 24 శాంపుల్స్ తీశారు. నంద్యాలలో బాతుల నుంచి, ఆలూరు, కర్నూలు రూరల్ మండలాల్లో ఏర్పాటు చేసిన కోళ్ల ఫారాల్లో కోళ్ల నుంచి రక్తనమూనాలు సేకరించినట్లు తెలిపారు. ప్రస్తుతం నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి ఉమ్మడి జిల్లాలోని రిజర్వాయర్ల వద్దకు వలసపక్షులు వచ్చేందుకు అవకాశం ఉందని, వెలుగోడు, సుంకేసుల, గాజులదిన్నె తదితర రిజర్వాయర్ల సమీపాల్లోని కోళ్ల ఫారాల్లోని కోళ్ల నుంచి రక్తనమూనాలను సేకరించామని వెల్లడించారు. ప్రస్తుతం ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బర్డ్‌ఫ్లూ వైరస్ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎక్కడా సోకినట్లు తమ దృష్టికి రాలేదని జేడీ రామచంద్రయ్య తెలిపారు.

శ్రీశైలంలో ఏసీబీ తనిఖీలు

శ్రీశైలం, ఫిబ్రవరి 26: శ్రీశైలం దేవస్థానంలో గతంలో జరిగిన అభివృద్ధి పనులలో అవకతవకలు జరిగినట్లుగా ఫిర్యాదులు రావడంతో సోమవారం ఏసీబీ సీఐ విశ్వనాథ్ ముగ్గురు బృందంతో కలిసి తనిఖీలు చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు ప్రహరీని ఏసీబీ అధికారులు పరిశీలించారు. ప్రహరీ కొలతలను నమోదు చేసుకున్నారు. శ్రీశైల దేవస్థానం ఇంజనీరింగ్ అధికారుల వద్ద నుంచి గతంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి బ్లూ ప్రింట్ సేకరించారు. ఇప్పటికే పలు దఫాలలో పరిశీలన చేసిన ఏసీబీ అధికారులు సోమవారం మళ్లీ పరిశీలించారు.

యువకుడి దారుణ హత్య

- హారన్ మోగించాడని గొడవ
- ఆటోలో ఉన్న కత్తులతో దాడి

కర్నూలు, ఫిబ్రవరి 26: కర్నూలు నగరంలో ఆదివారం అర్ధరాత్రి సాయికుమార్ (20) దారుణహత్యకు గురయ్యాడు. ఇతనితోపాటు ఇతని బావమరిది కురుమూర్తి తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన నగరంలో కలకలం రేపింది. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక రోజా వీధికి చెందిన సాయికుమార్ తల్లిదండ్రులు కొన్నేళ్ల కిందటే చనిపోయారు. అవ్వ దగ్గరే ఉంటున్నాడు. అవ్వ కూడా వారం రోజుల కిందటే చనిపోయింది. ఇసుక లోడింగ్ పనికి వెళ్తుంటాడు. ఇతని బావమరిది కురుమూర్తిది కూడా రోజా వీధే. సొంతంగా ఆటో నడుపుకుంటూ జీవిస్తుంటాడు. వీరిద్దరూ ఆదివారం రాత్రి రోజా వీధి నుంచి పాత కంట్రోల్ సమీపంలో ఉన్న హోటల్‌కు పరోటా తినేందుకు బయలుదేరారు. రోజా వీధి దాటిన తర్వాత కొద్ది దూరం వచ్చేటప్పటికీ వీరి వెనుకాల ఓ ఆటో వచ్చి అదే పనిగా హారన్ మోగించింది. దీంతో కురుమూర్తి వీరి ఆటో ఆపి వెనుక ఆటోలో ఉన్న ముగ్గురితో గొడవపడ్డాడు. గొడవ సర్దుమనిగిన తర్వాత బయలుదేరారు. మరోసారి కూడా ఆటో హారన్ మోగించడంతోపాటు ఆటోను ఓవర్‌టెక్ చేశారు. దీంతో సాయి కుమార్, కురుమూర్తిలు కూడా ముందుకు వెళ్తున్న ఆటోను ఓవర్‌టెక్ చేసి ముందుకు వెళ్లారు. ఇలా ఒకరినొకరు ఆటోను ఓవర్‌టెక్ చేసుకుంటూ కోర్టు సమీపంలో ఉన్న చాంబర్‌ఆఫ్ కామర్స్ కార్యాలయం దగ్గరకు వచ్చారు. సాయికుమార్, కురుమూర్తిలు వీరి ఆటోకు అడ్డంగా వెళ్లి ఆటోను నిలిపారు. అక్కడ వీరందరికి గొడవ జరిగింది. అయితే.. అప్పటికే ఆటోలో కత్తులు ఉండటంతో సాయికుమార్, కురుమూర్తిలపై నిందితులు దాడులు చేశారు. సాయికుమార్ కడుపులో కత్తి దిగి అక్కడికక్కడే మృతి చెందాడు. కురుమూర్తి కడుపులో, వీపుపైన కత్తితో దాడి చేసి వెంటనే అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికులు అప్రమత్తమై వీరిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సాయికుమార్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కురుమూర్తి ప్రస్తుతం ఆసుపత్రిలో కోలుకుంటున్నాడు. సంఘటన తెలిసిన వెంటనే టూటౌన్, వన్‌టౌన్ సీఐలు ఇంతియాజ్, పవన్‌కుమార్‌లు సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. హత్య జరిగిన ప్రాంతం రెండు పోలీస్‌స్టేషన్‌లకు మధ్య బార్డర్‌గా ఉండటంతో కేసు కట్టే విషయంలో కొంత తర్జనభర్జన జరిగి ఎట్టకేలకు వన్‌టౌన్ పోలీసులకు కేసు అప్పగించారు. సీఐ పవన్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం అర్ధరాత్రంతా హంతకుల కోసం గాలించారు. సోమవారం రాత్రి వరకు కూడా రోజా వీధి దగ్గర నుంచి హత్య జరిగిన ప్రాంతం ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. సీసీ కెమెరాల్లో ఆటో నెంబరు నమోదైందేమోనని చూస్తున్నారు. సాయికుమార్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మేనమామ (కురుమూర్తి) తండ్రికి అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్ కుమార్ తెలిపారు.

ఆటోలో కత్తులు!

ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఘటనను పరిశీలిస్తే.. ఆటోలో కత్తులు పెట్టుకోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇలా ఆటోలో కత్తులు పెట్టుకుని తిరగడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కాలంలో ఆటోలపై పోలీసులు తనిఖీలు పూర్తిగా మరిచిపోయారని, నిరంతరం తనిఖీలు చేస్తే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని పలువురు పేర్కొంటున్నారు. ఆటోలో కత్తులు లేకపోయి ఉంటే.. దెబ్బల వరకే గొడవ జరిగి ఉండేదని పలువురు భావిస్తున్నారు.

మల్టీ యుటిలిటీ సెంటర్‌కు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న అతిథులు


వైద్యులతో వాగ్వివాదం చేస్తున్న ఫోరెన్సిక్ వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 26: మల్టీ యుటిలిటీ సెంటర్‌కు సోమవారం ఉదయం భూమి పూజ చేశారు. ముఖ్యఅతిథి గా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి.వెంకటరంగారెడ్డి, కర్నూలు మెడికల్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.కె.చిట్టినరసమ్మ, ప్రభుత్వ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.పృథ్వి వెంకటేశ్వర్లు, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.ప్రభాకర్ రెడ్డి తదితరులు హాజరై భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.సాయిసుధీర్, అమెరికా నుంచి వచ్చిన కేఎంసీ చైర్మన్ డా.సదాశివరెడ్డి, హైదరాబాదు నుంచి కేఎంసీ గ్రాడ్యుయేట్స్ ట్రస్టు తరుపున సెక్రటరీ డా.ఎ.రామలింగారెడ్డి, డా.అమానుల్లా, కేఎంసీ అల్యూమిని అసోసియేషన్ తరుపున ప్రెసిడెంట్ డా.బి.కుమారస్వామి రెడ్డి, సెక్రటరీ డా.బి.బాలమద్దయ్య, ట్రెజరర్ డా.ఎం.మహేశ్వరరెడ్డి, డా.కేజీ గోవిందరెడ్డి పాల్గొన్నారు.

భూమి పూజపై వివాదం

కర్నూలు మెడికల్ కాలేజీ మైదానంలో మల్టీ యుటిలిటీ సెంటర్ భూమి పూజ రసాభాసగా మారింది. కొందరు వైద్యులు, విద్యార్థులు భూమి పూజ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. ప్రభుత్వం కేటాయించిన 60 సెంట్ల స్థలంలో మల్టీ యుటిలిటీ సెంటర్ నిర్మాణం భూమి పూజపై వైద్యులు రెండు వర్గాలుగా విడిపోయాయి. వంద ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ ఆసపత్రి, కర్నూలు మెడికల్ కాలేజీలో ఐదెకరాలు ఉన్న మైదానంలో యుటిలిటీ సెంటర్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఎలా కడతారని కొందరు వైద్యులు ప్రశ్నించారు. దీని వల్ల భవిష్యత్తు తరాల అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని ఫోరెన్సిక్ బ్రహ్మాజీ మాస్టర్, అసోసియేట్ ప్రొఫెసర్ రంగయ్య ప్రశ్నించారు. మైదానంలో సెంటర్ నిర్మాణం వద్దనడంతో ఇరు వర్గాల వైద్యుల మధ్య వాగ్వివాదం జరిగింది. గ్రౌండులో సెంటర్ కడితే అది చిన్నదవుతుందని గొడవకు దిగారు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య

సంజామల, ఫిబ్రవరి 26: మండలంలోని వసంతాపురం గ్రామానికి చెందిన మేకల రామ్మోహన్, పద్మావతి దంపతుల చిన్న కూతురు మేకల అమృత (19) సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. అమృత నిత్యం సెల్‌ఫోన్‌లో కాలక్షేపం చేస్తుండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో బెడ్ రూంలోకి పురుగుల మందుతాగి అపస్మారక స్థితికి వెళ్లింది. తల్లిదండ్రులు, బంధువులు అమృతను కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపారు.

'లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి'



కోర్టు హాల్‌లో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్న న్యాయాధికారి

ఆత్మకూరు, ఫిబ్రవరి 26: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మార్చి 9వ తేదిన జరిగే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి వెంకటేశ్వరరావు సూచించారు. సోమవారం ఆత్మకూరు కోర్టు హాల్‌లో పోలీసు అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీచేయదగ్గ కేసులను పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని సూచించారు. ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, ఆత్మకూరు అర్బన్, రూరల్ సీఐలు లక్ష్మీనారాయణ, నాగ భూషణ్, పాములపాడు, వెలుగోడు ఎస్సైలు అశోక్, భూపాలుడు ఉన్నారు.

ఫ్యాక్షన్ జోన్ సీఐగా వంశీధర్



ఎస్పీ రఘువీర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ వంశీధర్

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 26: నంద్యాల జిల్లా ఫ్యాక్షన్ జోన్ సీఐగా ఎస్.వంశీధర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆళ్లగడ్డ సబ్ డివిజన్ శిరివెళ్ల సీఐగా పనిచేస్తూ నంద్యాల జిల్లా ఫ్యాక్షన్ జోన్ సీఐగా బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిని జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

'శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే చర్యలు'



ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన నాగార్జునరెడ్డి

గోస్పాడు, ఫిబ్రవరి 26: శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నాగార్జునరెడ్డి హెచ్చరించారు. సోమవారం గోస్పాడు ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ఎన్నికల సమయం కావునా గ్రామాల్లో శాంతియుతంగా ఉండాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గోస్పాడు ఎస్ఐగా పని చేస్తున్న ఎస్ఐ మల్లికార్జున నంద్యాల టూటౌన్‌కు బదిలీ అయ్యారు.

పాత పెన్షన్ హామీ ఇచ్చే వారికే ఓటు: యూటీఎఫ్



ఓట్ ఫర్ ఓపీఎస్ బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 26: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాతపెన్షన్ అమలు చేస్తామని హామీ ఇచ్చే వారికే ఓటు వేస్తామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీవీ ప్రసాద్ అన్నారు. సోమవారం జిల్లా గౌరవాధ్యక్షుడు జాకీర్ హుసేన్, జిల్లా ప్రధాన కార్యదర్శి జే.సుధాకర్ అధ్యక్షతన ఓట్ ఫర్ ఓపీఎస్ బుక్‌లెట్‌ల ఆవిష్కరణ కార్యక్రమం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. పీవీ ప్రసాద్ మాట్లాడుతూ చలో విజయవాడ కార్యక్రమాన్ని ఏపీజేఏసీ వాయిదా వేయడం సరికాదన్నారు. జిల్లా కార్యదర్శులు అరవింద్, కాశీం, రామకృష్ణుడు, తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం కూల్చివేత



శిలాఫలకాన్ని కూల్చివేసిన దృశ్యం

ఆత్మకూరు, ఫిబ్రవరి 26: ఆత్మకూరు పట్టణ శివార్లలోని శ్రీశైలం రస్తాలో ముస్లింల కోసం అత్యాధునిక హంగులతో షాదీఖానా నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.2 కోట్లను మంజూరు చేయించారు. దీంతో అప్పటి మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చేతుల మీదుగా 2019 జనవరి 3వ తేదీన షాదీఖానా నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈక్రమంలోనే షాదీఖానాకు అదనంగా మరో రూ.20 లక్షల నిధులను మాజీ ఎమ్మెల్యే బుడ్డా మంజూరు చేయించి పనులను కూడా మొదలుపెట్టారు. అయితే టీడీపీ ప్రభుత్వ మారిపోవడంతో అధికారంలోకి వచ్చిన వైసీపీ నాలుగేళ్లకు పైగా షాదీఖానా నిర్మాణం గురించి పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో షాదీఖానా నిధులు అందుబాటులో లేకున్నా నిర్ణయించిన ప్రణాళికతో కాకుండా రేకులతో కూడిన నిర్మాణ పనులను హడావిడిగా పూర్తి చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే టీడీపీ హయాంలో మాజీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని కూల్చివేశారు. దీనిపై టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూల్చిన శిలాఫలకాన్ని తిరిగా నిర్మించాలని, లేనిపక్షంలో దీటుగా వ్యవహరిస్తామని టీడీపీ శ్రేణులు హెచ్చరిస్తున్నారు.

అటవీ సంరక్షణపై కళా జాతా

పాణ్యం, ఫిబ్రవరి 26: అడవుల సంరక్షణలో భాగంగా సోమవారం పాణ్యం, సుగాలిమెట్ట గ్రామాలలో అవగాహన కళా జాతా నిర్వహించారు. అటవీ సమీపంలోని గ్రామీలైన పాణ్యం, చెంచుకాలనీ, సుగాలిమెట్టలో కళాజాత నిర్వహించారు. అటవీ క్షేత్రాధికారి సుబ్బరాయుడు, డీఆర్వో చంద్రహాస్, బీట్ అధికారులు జమాల్‌వలి, అబ్దుల్‌కలాం, సర్పంచ్ పల్లవి, చంద్రనాయక్, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

'దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి'

నందికొట్కూరు ఫిబ్రవరి 26: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో వారి పక్షాల నిలబడి ఉద్యమబాట పడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు హెచ్చరించారు. దివ్యాంగుల సమస్యలపై నంద్యాల జిల్లా దివ్యాంగుల హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో సోమవారం మహాధర్నా చేపట్టారు. జిల్లా దివ్యాంగుల కుల పోరాట సంఘం నాయకులు నాగన్న, చంద్రశేఖర్, శ్రీనివాసులు, చిన్న నాగన్న, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు, షేక్షా, శేషమ్మ, సరస్వతి, యశోధ, తదితరులు పాల్గొన్నారు.

'కుక్కల బెడద నుంచి కాపాడాలి'

వెలుగోడు, ఫిబ్రవరి 26: వెలుగోడు పట్టణంలో కుక్కల బెడద నుంచి తమను కాపాడాలని పట్టణ ప్రజలు గ్రామ సర్పంచ్ జయపాల్, పంచాయతీ అధికారులకు మొరపెట్టుకున్నారు. సోమవారం వెలుగోడులో గ్రామ ప్రజలు మాట్లాడారు. వీధుల్లోకి రావాలంటే భయమేస్తోందని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

సైనికుల్లా పని చేయండి: బుడ్డా

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 26: టీడీపీ కోసం నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే, శ్రీశైలం ఎమ్మెల్యే అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బండిఆత్మకూరు టీడీపీ కార్యాలయం వద్ద సోమవారం మండలంలోని కడమలకాల్వకు చెందిన హరిప్రియ, మురళి, వలి ఆధ్వర్యంలో సుమారు 60 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరందరికీ బుడ్డా రాజశేఖర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ శ్రేణులకు ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో మదనభూపాల్, వి.శీను, చిన్నలింగారెడ్డి, బుగ్గరాముడు, సర్పంచ్ రామచంద్రుడు, షేక్ బాబు, జాకీర్, సిద్ధయ్య, రామసుబ్బయ్య, లక్ష్మీదేవి, తిరుపాల్, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

పంటలను కాపాడాలి: బుడ్డా

పరమటూరు రైతుల పంటలకు నీరు అందించి కాపాడాలని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి కోరారు. మండలంలోని సంతజూటూరు పికప్ ఆనకట్ట వద్ద నీటి నిల్వ పరిస్థితిని బుడ్డా సమీక్షించారు. కేవలం ఒక తడి నీరు అందిస్తే గ్రామంలో ఆరుతడి పంటవేసిన రైతులంతా గట్టెక్కుతారని, లేనిపక్షంలో నష్టం తప్పదని రైతులు చెప్పారు. కేసీ అధికారులతో చర్చించి నీరు అందించేలా కృషి చేస్తానని రాజశేఖర్‌రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. సాయిబాబా రెడ్డి, లాయర్ కృష్ణారెడ్డి, సర్పంచ్ రామచంద్రుడు, మహేశ్వరరెడ్డి, మల్లీశ్వరరెడ్డి, శేఖర్, జగ్గారెడ్డి, బుగ్గరాముడు, షేక్ బాబు, కలాం పాల్గొన్నారు.



బండిఆత్మకూరులో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కుటుంబాలు

ఆత్మకూరు: గత ఎన్నికల్లో సీఎం జగన్ తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆరోపించారు. ఈసందర్భంగా సోమవారం ఆత్మకూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2019 ఎన్నికల్లో సీఎం జగన్ ఇవ్వని హామీనే, చెప్పని అబద్ధమే లేదన్నారు. మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తామని చెప్పి విస్మరించారన్నారు. నాసిరకం మద్యంతో పాటు డ్రగ్స్, గంజాయి విక్రయాల ద్వారా యువత భవిష్యత్‌ను నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నేతల కనుసన్నల్లోనే రాష్ట్రంలో 4లక్షల బెల్ట్‌షాపులు నడిపిస్తున్నారని, ఇప్పటికే వేల కోట్ల రూపాయలు మద్యం ద్వారా సంపాదించిన అక్రమార్జన తాడేపల్లి ప్యాలెస్‌కు చేరిందని ఆరోపించారు.

బంగారు వస్తువుల సమర్పణ



బంగారు, వెండి వస్తువులను అందజేస్తున్న భక్తులు

శ్రీశైలం, ఫిబ్రవరి 26: శ్రీశైలం దేవస్థానానికి సోమవారం అమెరికాకు చెందిన కొత్తపల్లి సునీల్ దత్ అనే భక్తుడు కుటుంబ సభ్యులతో కలిసి బంగారు, వెండి వస్తువులను బహూకరించారు. 28 గ్రాముల 300 మిల్లీ గ్రాముల 2 బంగారు బాషికాలు, 5 గ్రాముల బంగారు కంకణం, కేజీ 25 గ్రాముల వెండి పళ్లెం, 865 గ్రాముల వెండి శక్తి ఆయుధం, 550 గ్రాముల వెండి నాగహారతి, 290 గ్రాముల కుక్కుటధ్వజం, 750 గ్రాముల ఐదు వెండి గిన్నెలు, 920 గ్రాముల గంధాక్షత గిన్నె, 190 గ్రాముల కమండలాన్ని, 300 గ్రాముల పెద్ద కమండలాన్ని అందజేశారు. అదేవిధంగా కౌలూరి సింధూర, పగిడాల, నంద్యాల జిల్లావారు కూడా వెండి 810 గ్రాముల వెండి పళ్లెం, 350 గ్రాముల వెండి పళ్లెం, 615 గ్రాముల మూడు వెండి చెంబులను బహూకరించారు. దాతలకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ సేవ

శ్రీశైలం, ఫిబ్రవరి 26: శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం వైభవంగా నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేసి, అర్చకులు వేదమంత్రోచ్చారణలతో పూజలు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి రథంపై ఆశీనులనుజేసి ప్రత్యేక పూజలు, మంగళ హారతులు జరిపి ఆలయ ప్రాంగణంలో రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన చదరంగం పోటీలు

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 26: ఏపీ చెస్ సంఘం ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం నిర్వహించిన జిల్లా స్థాయి చదరంగం పోటీలు సోమవారం ముగిశాయి. నంద్యాల నెరవాటి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జరిగిన పోటీల్లో విజేతలకు ప్రముఖ ఎముకలు, కీళ్ళ వ్యాధుల నిపుణులు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి సౌజన్యంతో పతకాలు, ట్రోఫీలను ప్రదానం చేశారు. జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ గుర్రాల రవికృష్ణ అధ్యక్షతన జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆళ్లగడ్డకు చెందిన యుగంధర్, నంద్యాలకు చెందిన షేక్ అద్నాన్‌అమీన్, హర్షవర్ధన్ ఆచారి, నాగశ్రీనీస్ విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ దినేష్‌రెడ్డి, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మధ్యంతర భృతి ప్రకటించాలి'

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 26: ఉద్యోగులకు ఇవ్వాల్సిన పే రివిజన్ స్కేల్స్ అమలు చేయడం ఆలస్యం అవుతున్నందున మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పోతురాజు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన పాత బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న, అదనపు కార్యదర్శి రాజు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, ఉపాధ్యక్షుడు దేవేంద్రుడు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'పరీక్షలపై భయాందోళన వద్దు'

కొత్తపల్లి, ఫిబ్రవరి 26: పది పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఎలాంటి భయాందోళనలు చెందవద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్ కుమార్, కాంకర్డ్ ఒకేషనల్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ వేణు గోపాల్ సూచించారు. ఈ నెల 5న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన టెన్త్ టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్ కుమార్, సాయిదిలీప్, గంగాధర్, లింగేష్, తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి'

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 26: ఢిల్లీ రైతాంగ పోరాటం చేసిన సందర్భంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నూనెపల్లె - కోవెలకుంట్ల జంక్షన్‌లో ఏపీ రైతు సంఘం, ఏపీ కౌలు రైతు సంఘం, సీఐటీయూ నంద్యాల శాఖల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. రైతు, కార్మిక సంఘాల నాయకులు రాజశేఖర్, తోట మద్దులు, లక్ష్మణ్, వెంకటలింగం, తదితరులు పాల్గొన్నారు.

'కనీస మద్దతు ధర చట్టం తీసుకు రావాలి'

ఆత్మకూరు, ఫిబ్రవరి 26: రైతులు పండించే పంటలకు డాక్టర్ ఎంఎస్.స్వామినాథన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరల చట్టం తీసుకురావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, ఏపీ రైతు సంఘం సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహనాయక్, కౌలు రైతు సంగం జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, వ్యవసాయ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సోమవారం ఆయా సంఘాల వారు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. వివిధ సంఘాల నాయకులు రజాక్, రామ్‌నాయక్, రణధీర్ తదితరులు ఉన్నారు.

'డబ్ల్యూటీవో నుంచి భారత్ వైదొలగాలి'

నందికొట్కూరు ఫిబ్రవరి 26: డబ్ల్యూటీవో నుంచి భారత్ వైదొలగాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహులు డిమాండ్ చేశారు. సోమవారం సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు అఖిల భారత రైతు కూలీ సంఘం, ఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యూ, ఆర్‌పీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక చౌడేశ్వరిదేవి ఆలయం నుంచి పటేల్ సెంటర్ వరకు ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులు, కోశాధికారి రమణయ్య శెట్టి, ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ సభ్యులు ఎల్లనాయుడు, పుల్లన్న, ఐఎఫ్‌టీయూ డివిజన్ అధ్యక్షులు తిక్కన్న, కార్యదర్శి వెంకటేశ్వరగౌడ్, మోటారు మెకానిక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడుసర్వేశ్వరుడు, వెంకటేశ్వర్లు,

శివస్వాముల అన్నదానానికి రూ.లక్ష విరాళం

ఆత్మకూరు, ఫిబ్రవరి 26: ఆత్మకూరు పట్టణంలోని అంబా సిద్ధేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిఏటా శివస్వాములకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఇటీవల ఆలయ కమిటీ వారు మాజీ ఎమ్మెల్యే బుడ్డాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ సమయంలో అన్నదాన కార్యక్రమానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా సోమవారం టీడీపీ నాయకులు ముత్యాల శ్రీనివాసులు ద్వారా ఆలయ కమిటీ వారికి రూ.లక్షను అందజేశారు.

సమస్యలను పరిష్కరించాలి: జేసీ

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 26: స్పందన సమస్యల వేగవంత పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం వైఎస్సార్ సెంటనరీ హాలులో స్పందన-ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జేసీతోపాటు డీఆర్వో పద్మజ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. స్పందనలో 176 దరఖాస్తులు రాగా వాటన్నింటిని విథిన్ ఎస్ఎల్ఏలోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

నంద్యాల రూరల్: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. పెద్ద కొట్టాల గ్రామంలోని జోసెఫ్ పాఠశాలలో ఉన్న 20, 21, 23, 24 పోలింగ్ స్టేషన్లతో పాటు బిల్లలాపురం గ్రామంలోని ఎంపీపీ పాఠశాల పోలింగ్ స్టేషన్ నెం. 16, 17 లో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. రెవెన్యూ అధికారులు ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

పాణ్యం, ఫిబ్రవరి 26: మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం కమ్యూనికేషన్ స్కిల్స్‌లో భాగంగా విద్యార్థులకు లాంగ్వేజ్, బాడీ లాంగ్వేజ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, హెచ్‌వోడీ డాక్టర్ శేషయ్య, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్రీలత, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, లావణ్య, హరిత, రమాదేవి పాల్గొన్నారు.

'జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి'

పాములపాడు, ఫిబ్రవరి 26: మండలంలో రబీలో రైతులు పండించిన జొన్న పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు తిమ్మారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మద్దూరు, క్రిష్ణానగర్, పెంచికలపల్లి, మిట్టకందాల, వేంపెంట, వాణాల తది తర గ్రామాల్లో దాదాపు 15వందల ఎకరాలలో జొన్నపంటను సాగుచేశారని చెప్పారు. వర్షాలకు ధాన్యం తడిస్తే ప్రభుత్వం, అధికారులు భాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

సారా స్థావరాలపై దాడులు

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 26: ఆత్మకూరు మండలంలోని సిద్ధాపురం గ్రామ శివార్లలో నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఆత్మకూరు అర్బన్ సీఐ కె.లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. సిద్ధాపురం గ్రామ శివార్లలోని నీలగిరి చెట్ల వద్ద ఉన్న అటవీ ప్రాంతంలో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. ఆ ప్రాంతంలో ఓ నాటు సారా బట్టిని గుర్తించామని, తమ రాకను గమనించి సారా నిర్వాహకుడు పరారి అయినట్లు తెలిపారు. దీంతో అక్కడి నాటు సారా బట్టిని ధ్వంసం చేసి ఆ ప్రాంతంలో డ్రమ్ములలో నిల్వ ఉంచి 1000 లీటర్ల బెల్లపు ఊటను నేల పాలు చేసి, 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకునిదర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'ఆ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి'

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 26: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ విద్యార్థులకు ఫీజులు, హాజరు పేరుతో హాల్ టికెట్లు ఇవ్వని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ డిమాండ్ చేశారు. సోమవారం రఫీ మాట్లాడుతూ కొన్ని విద్యాసంస్థలు హాల్ టికెట్లు ఇవ్వకుండా విద్యా ర్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, పరీక్షా కేంద్రాల వద్దకు ఆర్టీసీ బస్సులు నడపాలని కోరారు.

సీసీ రోడ్లు ప్రారంభం

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 26: మండలంలోని తర్తూరు, మండ్లెం, తంగడంచ, జూపాడుబంగ్లా గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లు, వాటర్‌ట్యాంకు, ప్రభుత్వ భవనాలను శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి, వైసీపీ నందికొట్కూరు ఇన్‌చార్జి ధార సుధీర్ పాల్గొని ప్రారంభించారు. మండ్లెం గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లు, తంగడంచలో రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్, జూపాడుబంగ్లాలో ఆరోగ్య కేంద్రం, తర్తూరు గ్రామంలో వాటర్‌ట్యాంకు ప్రారంభించారు. ఎంపీడీవో నూర్జహాన్, ఎంపీపీ సువర్ణమ్మ, సర్పంచులు నాగిరెడ్డి, ఈశ్వరరెడ్డి, వైసీపీ నాయకులు రమేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో రాష్ట్రం నాశనం'

గోస్పాడు, ఫిబ్రవరి 26: వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వ నాశనమైందని బీజేపీ నంద్యాల కన్వీనర్ అభిరుచి మధు అన్నారు. ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని గోస్పాడు, యాళ్ళూరు, కృష్ణాపురం, నెహ్రూనగరం, కానాలపల్లె గ్రామాల్లో పర్యటించారు. మధు మాట్లాడుతూ ఇసుక, మైనింగ్ మాఫియాతో రాష్ట్రాన్ని దివాలా తీయించారని, నకిలీ మద్యంతో రాష్ట్రంలోని ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ప్రజా పోరు కోకన్వీనర్ తాడి రామకృష్ణారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు మధుగోపాల్, స్వాతి, జిల్లా నాయకులు సుధాకర్, గాండ్ల ఈశ్వర్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

లాడ్జి నిర్వాహకుడిపై దాడి

మహానంది, ఫిబ్రవరి 26: మహానంది సమీపంలోని పార్వతీపురం కాలనీలోని లాడ్జి నిర్వాహకుడు గాండ్ల మురళిపై ఆదివారం రాత్రి నంద్యాలకు చెందిన నలుగురు యువకులు దాడి చేసి గాయపర్చినట్లు మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ సోమవారం తెలిపారు. నంద్యాలకు చెందిన మోకే వినయ్, వికాస్‌తో పాటు మరో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మోటర్ సైకిళ్లపై మహానందిలోని లాడ్జి వద్దకు చేరుకున్నారు. అనంతరం ఘర్షణ పడి మురళిని తీవ్రంగా గాయపర్చారు. కాలనీలోని శివప్రియ లాడ్జి పంపకాల విషయంలో యజమానుల మధ్య ఏర్పడ్డ విభేదాల కారణంగానే దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్‌కు ఏఎస్ఐగా పదోన్నతి

పాణ్యం, ఫిబ్రవరి 26: పాణ్యం పోలీసుస్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పఠాన్ మహ్మద్ ఆయుబ్‌ఖాన్ సోమవారం ఏఎస్ఐగా పదోన్నతి పొందినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. పోలీసు సిబ్బంది ఖాన్‌కు అభినందనలు తెలిపారు.

'వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం'

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 26: వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మోమిన్ షబానా విమర్శించారు. సోమవారం కరివేనలో ప్రజా పోరు యాత్ర నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించారు. నాయకులు మౌలిబాషా, చింతా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'పోలియో చుక్కలు వేయించాలి'

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 26: ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో సమావేశ భవనంలో ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మార్చి 3న పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో మోహన్‌కుమార్, సీహెచ్‌వో ఖుద్దూస్‌బాషా, హెల్త్ సూపర్ వైజర్ రమణమ్మ, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నిశ్చితార్థ మండప నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న కంచి కామకోటి పీఠాధిపతి

మహానంది, ఫిబ్రవరి 26: మహానంది క్షేత్రంలో నూతనంగా నిర్మిస్తున్న నిశ్చితార్థ మండపానికి సోమవారం కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామి భూమి పూజ నిర్వహించారు. గతంలో ఉన్న నిశ్చితార్థ మండపాలన్ని ఆలయ అభివృద్ధిలో భాగంగా దేవదాయశాఖ అధికారులు తొలగించారు. ఇందులో భాగంగా ఆదివారం మహానందికి వచ్చిన పీఠాధిపతితో ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు చర్చించారు. ఆలయం పరిసరాల్లో గతంలో ఉన్న స్థానంలోనే నిశ్చితార్థ మండపానికి కంచికామ కోటి పీఠాధిపతి చేత శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు మహానంది మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టర్లను పీఠాధిపతి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. మహానందిలో మహా కుంభాభిషేకానికి త్వరలో ముహూర్తం నిర్ణయిస్తానని పీఠాధిపతి తెలిపారు. అనంతరం భక్తులకు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. తన శిష్య బృందంతో నంద్యాల నుంచి ఆళ్లగడ్డకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు ఎర్రమల్ల మధు, వెంకటేశ్వర్లు, కనుమర్లపూడి మస్తాన్‌రావు పాల్గొన్నారు.

నంద్యాల (కల్చరల్): నేటి సమాజంలో విద్య, వైద్యంతో పాటు వేదం ముఖ్యమని కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి తెలిపారు. సోమవారం సాయంత్రం నంద్యాల పట్టణంలోని గాయత్రీ మాత ఆలయంలో బ్రహ్మణ సేవాసమాఖ్య ఆధ్వర్యంలో బ్రహ్మణులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధర్మ మార్గంలో పయనించాలన్నారు. బ్రహ్మణ సేవా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

'నిరుద్యోగులతో వైసీపీ ప్రభుత్వం చెలగాటం'



మాట్లాడుతున్న మురళీమోహన్

నందికొట్కూరు ఫిబ్రవరి 26: వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులతో చెలగాటమాడుతోందని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీ మోహన్ అన్నారు. సోమవారం నందికొట్కూరు పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం నిరుద్యోగ యువతను మోసం చేసేందుకే ఎన్నికలకు రెండు నెలల ముందు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారని అన్నారు. అందులోనూ నామమాత్రంగా 6100 పోస్టులను నోటిఫికేషన్ ఇచ్చి అతి తక్కువ సమయంలో పరీక్ష నిర్వహించడం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడడమేనని విమర్శించారు. డీఎస్సీ అభ్యర్థులకు రూ.750 అప్లికేషన్ ఫీజు నిర్ణయించి నిరుద్యోగులను దోచుకున్నారని మండిపడ్డారు. తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి ఖాజావలి, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు సలాం బేగ్, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'రైతుల ఆర్థిక పురోగతికి కృషి చేయాలి'



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి

గడివేముల, ఫిబ్రవరి 26: రైతులు ఆర్థిక పురోగతి సాధించేందుకు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కృషి చేయాలని ఉమ్మడి జిల్లా నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నవయూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నాబార్డు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన గడివేముల ఉత్పత్తిదారుల సంఘాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పంట సాగు చేసేందుకు, ధాన్యాన్ని విక్రయించుకునేందుకు రైతుల ఉత్పత్తిదారుల సంఘం తోడ్పాటు అందిస్తుందని అన్నారు. అనంతరం జేఎస్‌డబ్ల్యూ సీఎస్ఆర్ మేనేజర్ రవికుమార్ మాట్లాడుతూ దళారుల వ్యవస్థను అరికట్టి రైతులు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రైతుల ఉత్పత్తిదారుల సంఘాలు కృషి చేయాలన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారి హేమసుందర్‌రెడ్డి, ఏపీజీబీ మేనేజర్ బింజిల్‌జాన్, పశుసంవర్ధకశాఖ అధికారి పావని, సొసైటీ సీఈవో ఆదినారాయణ, గడివేముల ఉత్పత్తిదారుల సంఘం సీఈవో రవిచంద్ర ఆచారి, నవయూత్ అసోషియేషన్ డైరెక్టర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వెలగమాను డ్యామ్ కాలువ నిర్మాణంపై దృష్టి పెట్టండి: బొజ్జా



మాట్లాడుతున్న బొజ్జా దశరథ రామిరెడ్డి

గడివేముల, ఫిబ్రవరి 26: సుమారు 15 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే వెలగమాను డ్యామ్ కాలువ నిర్మాణంపై దృష్టి పెట్టాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి అన్నారు. మండలంలోని పెసరవాయి, కరిమద్దెల, గడివేముల రైతులతో కలిసి ఆయన సోమవారం వెలగమాను డ్యామ్, అలగనూరు రిజర్వాయర్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 2005 సంవత్సరంలో అలగనూరు రిజర్వాయర్ నుంచి పెసరవాయి సమీపంలో ఉన్న వెలగమాను వరకు కాలువ నిర్మాణం చేపట్టేందుకు సర్వే చేశారని అన్నారు. సర్వే పూర్తయి సుమారు 18 సంవత్సరాలు గడిచినా కాలువ నిర్మాణ పనులపై నాయకులు దృష్టి పెట్టకపోవడం బాధాకరమన్నారు. వెలగమాను డ్యామ్ కాలువ నిర్మాణ పనులు చేపట్టడం వల్ల గడివేముల, నంద్యాల, బండిఆత్మకూరు మండలాల్లోని 12 గ్రామాల పరిధిలో 15 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. అదేకాక నంద్యాల ప్రాంతంలోని కేసీ కెనాల్ ఆయకట్టుకు నీరు సక్రమంగా అందడంతో పాటు ఆళ్లగడ్డ, కడప ప్రాంతానికి నీటి పంపిణీ చేసే ప్రధాన కాలువపైన ఒత్తిడి తగ్గుతుందన్నారు. అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులను తక్షణమే చేపట్టి వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందించా లని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రైతులు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక నాయకులు రామకృష్ణారెడ్డి, డేవిడ్, శేషన్న పాల్గొన్నారు.

వేపదారు శివలింగానికి పూజలు



వేపదారు శివలింగాన్ని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 26: కొత్తపల్లి మండలంలోని కృష్ణా తీరాన ఉన్న ప్రాచీన సంగమేశ్వర ఆలయం లోని లలిత సంగమేశ్వర స్వామిని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. సోమవారం శివునికి ప్రత్యేకమైన రోజు కావడంతో పురోహితుడు తెలకపల్లి రఘురామ శర్మ స్వామివారిని పవిత్ర కృష్ణా జలాలతో అభిషేకించి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా భక్తులు సప్తనదులలో పవిత్ర స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని తరించారు. భక్తులకు కాశిరెడ్డి నాయన ఆశ్రమ కమిటీ నిర్వహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

యాగంటిలో పల్లకి సేవ



పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె, ఫిబ్రవరి 26: మండలంలోని యాగంటి ఉమా మహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పల్లకి సేవ ఉత్సవం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, పాత పాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డితోపాటు భక్తులు, ఆలయ పూజారులు పల్లకిలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. పల్లకి సేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొన్నారు.

నారసింహుడికి ప్రత్యేక పూజలు



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న భక్తులు

రుద్రవరం, ఫిబ్రవరి 26: రుద్రవరంలో పార్వేట పల్లకీలో కొలువుదీరిన జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాద వరదస్వాములకు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలుపు వద్ద భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని ఉత్సవమూర్తులకు పూజలు చేశారు. బోయలు, గ్రామస్థులు ఉత్సవ పల్లకీని మోశారు.

బీసీకి అభినందన



బీసీ జనార్థనరెడ్డిని అభినందిస్తున్న జనసేన నాయకులు

బనగానపల్లె, ఫిబ్రవరి 26: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం జనసేన నాయకులు టీడీపీ తరపున ఎమ్మెల్యే టికెట్ తొలి జాబితాలోనే చోటు దక్కించుకున్న బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసి శాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా జనసేన బనగానపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి సురేశ్‌బాబు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీసీ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దొడియం గురప్ప, నాగప్రసాద్, కిట్టు, షేక్షావలి, భాను పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

బనగానపల్లె, ఫిబ్రవరి 26: స్థానిక కొండపేటలో వెలసిన అతిపురాతన కొట్టాల శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం అందించిన రూ.6 కోట్ల నిధులతో ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు భూమి పూజ చేశారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ రవికుమార్, ఈవో బ్రహ్మానందారెడ్డి, కాటసాని ప్రసాద్ రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, లాయర్ మాధవరెడ్డి పాల్గొన్నారు

'టీడీపీతోనే యువతకు న్యాయం'

నంద్యాల, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే యువతకు న్యాయం జరుగుతుందని, వచ్చే ఎన్నికల్లో గెలిపించేందుకు యువత సిద్ధంగా ఉందని ఆ పార్టీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని వారి స్వగృహంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నంద్యాల పార్లమెంటు పరిధిలో మొదటి సారి ఓటు వేసే యువతకు అవగాహన కల్పించాలని ఆదేశించిన టీడీపీ అధిష్టానం మేరకు కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

'నీటి ఎద్దడి నివారణకు చర్యలు'

నంద్యాల, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో మంచి నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ రమేష్‌బాబు చెప్పారు. పట్టణంలోని కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు కురవకపోవడంతో బోర్లలో మంచి లభ్యత తగ్గిందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు మంచి నీటిని వృథా చేయవద్దని సూచించారు. కొత్త కొళాయిలు మంజూరు చేయడం లేదన్నారు. నీటి ఎద్దడి గ్రామాల ప్రజలకు ట్యాంకర్ల నీటిని సరఫరా చేసేందుకు రూ.50 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు.


'నీటి సమస్య పరిష్కారానికి చర్యలు'

చాగలమర్రి, ఫిబ్రవరి 26: మండలంలోని మల్లెవేముల గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ ఈదుల సరోజమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య తెలిపారు. మల్లెవేములలో తాగునీటి కష్టాలు అన్న శీర్షికతో సోమవారం కథనం ప్రచురితమైంది. ఎస్సీ కాలనీలో కొత్తగా బోరు వేయించి నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. గ్రామంలో కొళాయిల ద్వారా ప్రజలకు నీరు అందించన్నట్లు తెలిపారు. భూగర్భ జలాలు తగ్గిన బోర్లలో అదనపు పైపులు వేసి నీటి సరఫరా జరిగేలా చూస్తామన్నారు.

'ప్రతి గొర్రెకు ఒక నెంబరు'

రుద్రవరం, ఫిబ్రవరి 26: రుద్రవరం మండలంలో ప్రతి గొర్రెకు ఒక నెంబరు కేటాయించినట్లు పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ సోమవారం తెలిపారు. మండలంలో 75 వేల గొర్రెల, మేకలు ఉన్నాయని, ఇప్పటికి 69 వేల గొర్రెలు, మేకలకు నెంబరు కేటాయించామన్నారు. మిగిలిన ఆరు వేల గొర్రెలకు నెంబరు కేటాయించాల్సి ఉందన్నారు. గొర్రెల యజమానులు వేసవిలో జాగ్రత్తలు తీసుకుని జీవాలు కాపాడుకోవాలని సూచించారు.

'పిల్లలు బడిలో ఉండాలి'



ముత్యాలపాడులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

చాగలమర్రి, ఫిబ్రవరి 26: మండలంలోని ముత్యాలపాడు బర్ఫ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు కలిసి బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలంటూ సోమవారం అవగాహన ర్యాలీ చేశారు. తల్లిదండ్రులు బడి మానివేసిన పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. ముత్యాలపాడు, చక్రవర్తులపల్లె గ్రామాల్లో ర్యాలీ చేశారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బర్నబాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోచుకోవడమే వైసీపీ నైజం: కోట్ల

డోన్, ఫిబ్రవరి 26: రాష్ట్ర సంపదను, ప్రజలను దోచుకోవడమే వైసీపీ నైజమని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం డోన్ సమీపంలోని హైవే పక్కన దత్తాత్రేయ స్వామి గుడిలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్కసాగరం లక్ష్మీరెడ్డి, ఓబులాపురం శేషిరెడ్డిలతో కలిసి కోట్ల ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా కర్నూలులోని కోట్ల నివాసంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్న గౌడు, మాజీ ఎంపీటీసీ దేవరబండ వెంకటనారాయణ, సుధీష్‌రాజు, బాష్యం శ్రీను, శ్రీధర్‌గౌడ్, కిరణ్‌యాదవ్, కేఈ శ్యాం, రంజిత్ కిరణ్, న్యాయవాది ఆంజనేయగౌడు, చిట్యాల రఘు, దేవరబండ రాముగౌడు, బోంచెర్వుపల్లి టీడీపీ నాయకులు కోట్లను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అరాచకం తప్ప అభివృద్ధి లేదన్నారు. రాష్ట్రాన్ని అప్పులో ముంచి ప్రజల భవిష్యత్తును నాశనం చేశారని మండిపడ్డారు. రూ.లక్షల కోట్లు అప్పులు చేసినా ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుతోనే మళ్లీ రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. టీడీపీ కార్యకర్తలకు ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకు రావాలని ఆయన సూచించారు.

1న డోన్‌లో భారీ బహిరంగ సభ
కోట్లకు భారీ స్వాగతం పలికేలా ఏర్పాట్లు

డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పేరును ప్రకటించిన సందర్భంగా మార్చి 1వ తేదీన పట్టణంలో టీడీపీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు టీడీపీ నాయకులు సన్నాహాలు చేస్తున్నారు. మొదటిసారిగా డోన్‌కు వస్తున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి భారీగా స్వాగతం పలికేందుకు టీడీపీ వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ నెల 24వ తేదీన టీడీపీ అధినేత చంద్రబాబు డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పేరును ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో మార్చి 1న శుక్రవారం డోన్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. గుత్తి రోడ్డులోని అమ్మ హోటల్ సర్కిల్ నుంచి మధు ఫంక్షన్ హాలు వరకు భారీ ర్యాలీ నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గంలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల నుంచి భారీ జనసమీకరణతో సభను నిర్వహించేలా పార్టీ ముఖ్య నాయకులు చర్యలు తీసుకుంటున్నారు. అదే రోజు టీడీపీ కార్యాలయాన్ని ఐటీఐ రహదారిలో ప్రారంభించనున్నారు.



కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

మాజీ మంత్రి సమక్షంలో టీడీపీలో చేరిక

నంద్యాల, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని సద్దాం కాలనీకి చెందిన న్యాయవాది ఖాజాహుసేన్ కుటుంబ సభ్యులు తిరిగి మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో సోమవారం టీడీపీలో చేరారు. కాలనీకి చెందిన సుమారు 50 కుటుంబాలు పార్టీలో చేరాయి. అనంతరం ఆదర్శ అభ్యుదయ కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భార్గవ్ రామ్‌నాయుడు, కౌన్సిలర్ హుసేన్‌బాషా, న్యాయవాదులు శివప్రసాదరావు, శిరివెళ్ల రమణయ్య, విజయ్, మాజీ కౌన్సిలర్స్ సలాం, సుంకన్న, మహిళా కార్యకర్తలు రమిజా, అట్ల శ్రీదేవి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని కూలూరు రహదారిలో భూమా అఖిలప్రియ సమక్షంలో 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. వీరికి అఖిలప్రియ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలే కీలకమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్సర్‌బాషా, సల్లా నాగరాజు, నరసింహారెడ్డి, గుత్తి నరసింహులు, మహబూబ్‌బాషా, ఉసేన్‌వలి, షరీఫ్, అనీఫ్, మాబులాల్, జెట్టి నాగరాజు, ముల్లా అబ్దుల్లా, రఫిద్దీన్, అజీమ్, గఫార్, భాస్కర్‌రెడ్డి, రమేష్, కేఆర్ రవి, బాలకృష్ణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో అఖిలప్రియ దంపతులు

అఖిలప్రియను కలిసిన టీడీపీ నాయకులు

దొర్నిపాడు: భూమా అఖిలప్రియను ఆమె స్వగృహంలో టీడీపీ నాయకులు కలిశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక కావడంతో పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు చక్రవర్తి నాయుడు, శ్యామ్‌సుందర్, లక్ష్మీనారాయణ, కొత్తపల్లి సురేంద్ర, హర్షవర్ధన్ తదితరులు ఉన్నారు.

సంపూర్ణ మద్య నిషేధం ఎప్పుడు ?

జగన్ ప్రభుత్వానికి మాజీ ఎమ్మెల్యే బీసీ ప్రశ్న

బనగానపల్లె, ఫిబ్రవరి 26: రాష్ట్రంలో సంపూర్ణ మద్య నిషేదం ఎప్పుడని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో బీసీ జనార్దన్‌రెడ్డి విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. మద్య నిషేధం చేసి ఓట్లు అడుగుతానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. జగన్ మాట తప్పి మడప తిప్పిన వ్యక్తి అని విమర్శించారు. నాసిరకం మద్యం అమ్మి వాటి ద్వారా సమకూరిన రూ.లక్షల కోట్ల ఆదాయం తాడేపల్లె ప్యాలెస్‌కు చేరుతోందని ఆరోపించారు. నాసిరకం మద్యం, గంజాయి, డ్రగ్స్ బారిన పడి యువత భవిష్యత్తు నాశనమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాసిరకం మద్యం పోవాలన్నా.. మహిళల మాంగళ్యాలు మంట కలవకుండా ఉండాలన్నా టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును సీఎంగా చేసుకోవాలని బీసీ పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న బీసీ జనార్దన్‌రెడ్డి

వైసీపీకి ఓటమి ఖాయం: కాంగ్రెస్



అనంతపురం సభకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

డోన్(రూరల్), ఫిబ్రవరి 26: సాధారణ ఎన్నికల్లో వైసీపీకి ఓటమి ఖాయమని కాంగ్రెస్ పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, డోన్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి అన్నారు. సోమవారం అనంతపురంలో జరిగిన కాంగ్రెస్ రాష్ట్ర పునర్నిర్మాణ న్యాయ సాధన సభకు డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు 25 వాహనాల్లో తరలివెళ్లారు. ఈసందర్భంగా గార్లపాటి మద్దిలేటి మాట్లాడుతూ రాష్ట్రంలో నడుస్తున్న అరాచక పాలనతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్, నాగసుబ్బయ్య, నాగరాజు, శివరా ముడు, మధు, శివ, గంగాధర్, సుధాకర్, కంబగిరి పాల్గొన్నారు.

గురప్పస్వామి ప్రత్యేక పూజలు

రుద్రవరం, ఫిబ్రవరి 26: మండలంలోని నాగిరెడ్డిపల్లె సమీపంలో కొలువుదీరిన గురప్పస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి నైవేద్యం సమర్పించారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

ప్యాపిలి, ఫిబ్రవరి 26: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్ప వని సీఐ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనల ప్రకారమే ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే కుటుంబాలు వీధిన పడతాయన్నారు.

'చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి'

చాగలమర్రి, ఫిబ్రవరి 26: ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని వైద్యులు ఇమ్రాన్, అంజలి సూచించారు. సోమవారం ప్రభుత్వ వైద్యశాలలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లకు పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ మార్చి 3 నుంచి మూడు రోజుల పాటు జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ, సీహెచ్‌వో రమణమ్మ, హెచ్‌ఈ వెంకటమ్మ, సూపర్‌వైజర్లు రామలింగారెడ్డి, సీతారాములు పాల్గొన్నారు.

'తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి'

రుద్రవరం, ఫిబ్రవరి 26: మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో రామచంద్ర సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 16 సచివాలయాల పరిధిలో ఎక్కడెక్కడ తాగునీటి సమస్య ఉందో కార్యదర్శులతో అడిగి తెలుసుకున్నారు. మండల పరిషత్‌లో జనరల్‌ఫండ్ నిధులు ఏమీ లేవన్నారు. ప్రస్తుతానికి మంచినీటి పథకాల పనులు కొత్తవి చేయించాలన్నా చేయించిన వారికి నిధులు వచ్చిన తరువాతే బిల్లులు చేస్తామన్నారు. కొళాయిలకు మరమ్మతులు, పైపులైన్లకు మరమ్మతులు, వాటర్ ట్యాంకులకు క్లోరినేషన్ చేసి ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలని సూచించారు.

ఆనందీబాయి జోషి సేవలు చిరస్మరణీయం

బేతంచెర్ల, ఫిబ్రవరి 26: భారతీయ మహిళా వైద్యురాలు ఆనందీబాయి జోషి సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సాగరిక అన్నారు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆనందీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బేతంచెర్ల ప్రభుత్వ వైద్యశాలలో సామాజిక కార్యకర్త డోన్ పి.మహ్మద్ రఫి ఆధ్వర్యంలో బేతంచెర్ల ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డా.వి.సాగరిక అధ్యక్షతన ఆనందీబాయి వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైద్యులు డా.చందన, డా.వంశీకృష్ణ, హెడ్ నర్సు పద్మావతి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

'సర్వేను వేగవంతం చేయాలి'

శిరివెళ్ల, ఫిబ్రవరి 26: అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ సర్వేను వేగవంతం చేయాలని ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం అధికారి జగదీష్ చంద్రారెడ్డి వైద్య సిబ్బందిని ఆదేశించారు. శిరివెళ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సోమవారం తనిఖీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష -2 సర్వే మార్చి 5వ తేదీకి పూర్తి చేయాలని, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన కార్యక్రమంలో లబ్ధిదారుల ఆన్‌లైన ప్రక్రియ మరింత వేగవంతం చేయాలన్నారు. అలాగే మార్చి 3, 4వ తేదీల్లో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రణాళికతో వ్యవహరించాలన్నారు. సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, ఎల్‌టీ శ్రీనివాసులు, శివనాగజ్యోతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీగా ఈవోగా సుబ్బారావు

రుద్రవరం, ఫిబ్రవరి 26: రుద్రవరం పంచాయతీ ఈవోగా సుబ్బారావు బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీవో రామచంద్ర సోమవారం తెలిపారు. కడప జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ఈవో సుబ్బారావు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

బీసీ సంఘం నాయకుడి మృతికి నివాళి

చాగలమర్రి, ఫిబ్రవరి 26: చాగలమర్రి మండల బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు కృష్ణయ్య మృతికి టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి సోమవారం నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు టీడీపీ నాయకులు రామసుబ్బయ్య, అబ్దుల్ ఖాదర్, గాంధీ, ఓబులేసు, రాజేష్, శేఖర్‌రెడ్డి, నూర్‌బాషా, బషీర్ నివాళి అర్పించారు. అదేవిధంగా బీసీ సంఘం నాయకులు, దూదేకుల సంఘం నాయకులు నివాళి అర్పించారు.

పునాదులు దాటని ప్రభుత్వ లక్ష్యం

- నేటికీ పూర్తి కాని కలుగొట్ల గ్రామ సచివాలయం
- చేతులెత్తేసిన కాంట్రాక్టరు

కొవెలకుంట్ల, ఫిబ్రవరి 26: మండలంలోని కలుగొట్ల గ్రామంలో నాలుగేళ్లు గడిచినా సచిలయ పునాదులు, ఆర్‌బీకె భవనాలు, హెల్త్ క్లినిక్ భవనాల పనులు పునాదులు దాటలేదు. గ్రామీణ ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి సత్వరమే సేవలందించాలనే ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టింది. అయితే నేటికీ మండలంలోని కలుగొట్ల గ్రామంలో సచివాలయం నిర్మాణం కలగానే మిగిలింది. మండలానికి 12 సచివాలయాలు, ఆర్‌బీకెలు, హెల్త్‌క్లినిక్‌లు మంజూరయ్యాయి. ఇందులో గుళ్లదుర్తి, భీమునిపాడు, సౌదరదిన్నె, బిజనవేముల, చిన్నకొప్పెర్లతో పాటు కొవెలకుంట్ల పట్టణంలో 5 సచివాలయ భవనాలు పూర్తి అయ్యాయి. అయితే కలుగొట్ల గ్రామంలో జగనన్న కాలనీలో గ్రామ సచివాలయం, ఆర్‌బీకె హెల్త్ క్లినిక్‌లు పునాదులకే పరిమితయ్యాయి. ఈకాలనీలో విద్యుత్ సౌకర్యం, నీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. కాంట్రాక్టరు గ్రామ సచివాలయం పూర్తి చేయకుండా చేతులెత్తేశారు. నాలుగేళ్లు గడిచినా నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో పునాదుల్లో ఉన్న నిర్మాణాలను నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో కలుగొట్లలో సచివాలయం కలగానే మిగిలింది. ఇక్కడి అధికారులు సచివాలయం, ఆర్‌బీకె, హెల్త్ క్లినిక్‌లు లేకపోవడంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో సచివాలయ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. ఆర్‌బీకె భవనం లేకపోవడంతో గ్రామ పశువైద్యశాలలోని ఓ భవనంలో ఆర్‌బీకె సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. హెల్త్ క్లినిక్ భవనం లేక వైద్య సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల నిర్లక్ష్యం గ్రామస్థులకు శాపంగా మారింది.



కలుగొట్లలో పునాదులకే పరిమితమైన సచివాలయం

రీటెండర్ వేసి పనులు ప్రారంభిస్తాం

గ్రామ సచివాలయం, ఆర్‌బీకె, హెల్త్ క్లినిక్ భవనాల పనులు పునాదుల్లో నిలిచిపోయాయి. కాంట్రాక్టరు పనులు చేయకపోవడంతో నిర్మాణం పనులు ఆగిపోయాయి.. రీటెండర్ పిలిచి పనులు పూర్తి చేస్తాం.

- చెంచయ్య, పీఆర్ ఏఈ

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ



శివవరంలో కుంటెమ్మకు పూజలు చేస్తున్న బీసీ ఇందిరమ్మ

అవుకు, ఫిబ్రవరి 26: అవుకు మండలం శివవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో కుంటెమ్మ, పోతరాజు విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ హాజరై పూజలు చేశారు. టీడీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, బసిరెడ్డి, మధుమోహన్‌రెడ్డి, గొల్లపు శేఖర్ రెడ్డి, పుల్లారెడ్డి, వెంకటరెడ్డి, చంద్రమౌళీశ్వరరెడ్డి, రామసుబ్బారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

రైతుల బైఠాయింపు

రుద్రవరం, ఫిబ్రవరి 26: మండలంలోని ఎల్లావత్తుల సబ్‌స్టేషన్ వద్ద సోమవారం రాత్రి కోటకొండ గ్రామానికి చెందిన రైతులు బైఠాయించారు. 9 గంటల విద్యుత్ సరఫరాలో 2 గంటలు కోతకోసి 7 గంటలు ఇస్తున్నారని, దీంతో నీరు సరిగా అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాది రూపాయలు పెట్టు బడులు పెట్టి పంటలు సాగు చేశామని చెప్పారు. ఒక వైపు విద్యుత్ సరఫరా ఏడుగంటలే అని మరో వైపు భూగర్భజలాలు అడుగంటి పంటలకు సాగునీరు సకాలంలో అందడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నరసింహ, వెంకటపతి, శంకర్, హుసేని, పలువురు రైతుల పాల్గొన్నారు.

'సకాలంలో వైద్య సేవలు అందించాలి'

రుద్రవరం, ఫిబ్రవరి 26: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సకాలంలో రోగులకు వైద్యసేవలందించాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి శారదాబాయి సూచించారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎయిడ్స్, క్షయ, కుష్ఠు వ్యాధి రికార్డులను పరిశీలించారు. వైద్యసేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి బాబు తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా అదనపు వైద్యాధికారి

నీటి కోసం విద్యార్థుల కష్టాలు

చాగలమర్రి, ఫిబ్రవరి 26: మండలంలోని ముత్యాలపాడు ఎస్‌పీజీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో తాగడానికి నీరు లేక పోవడంతో పాఠశాల బయట రహదారిపై వచ్చే కొళాయి వద్ద నీరు పట్టుకుంటూ కష్టాలు పడ్డారు. పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన సమయంలో నీరు లేక ఇబ్బందులు పడుతున్నా పాఠశాల ఉపాధ్యాయులు పట్టించుకోవడం లేదని విద్యార్థి జేఏసీ సంఘం నాయకుడు ఇండ్ల జయరాజు అన్నారు.



పాఠశాల బయట కొళాయి వద్ద విద్యార్థినుల పాట్లు

దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దివ్యాంగులు

ప్యాపిలి, ఫిబ్రవరి 26: పెరిగిన నిత్యవసరాల దృష్టిలో పెట్టుకొని దివ్యాంగులకు రూ.6వేలు పింఛన్ ఇవ్వాలని జిల్లా దివ్యాంగుల జేఏసీ కార్య నిర్వాహణ కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో దివ్యాంగులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శివశం కర్ మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల, సంక్షేమంపై రాజకీయ పార్టీలు తమ మేనిఫె స్టోలో చేర్చాలన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29న కర్నూలు ఎస్టీబీసీ మైదానంలో దివ్యాంగుల భారీ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేశ్, రంగస్వామి, రామచంద్ర, నాగరాజు, పాతిమా పాల్గొన్నారు.

'విద్యార్థుల్లో గ్రేడింగ్ పెంచాలి'

చాగలమర్రి, ఫిబ్రవరి 26: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల గ్రేడింగ్‌ను పెంచాలని ఎంఈవో అనూరాధ సూచించారు. సోమవారం మండలంలోని తిప్పనపల్లె, చిన్నబోదనం ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్‌బుక్కులను, ఎఫ్ఏ-4 పరీక్షలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఆంజనేయరెడ్డి, సీఆర్పీలు పాల్గొన్నారు.